# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పేదలు విద్య ద్వారా సాధికారత సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పన్నెండేళ్లుగా దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు.
- ❖ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజ పలు చోట్ల "యోగాంధ్ర" కార్యక్రమాలను నిర్వహించారు.
- ❖ యువతకు విమానయాన శిక్షణ ఇచ్చేందుకు రాజమహేంద్రవరంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ)ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు.

=====================

పేదలు విద్య ద్వారా సాధికారత సాధించాలనేది ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు.. అంబేద్కర్ గురుకులాల జిల్లా సమన్వయ కర్తలు, ప్రధానోపాధ్యాయులు, సహాయ సంచాలకులకు విజయవాడ వీఆర్ సిద్ధార్థ కాలేజీలో ఈరోజు నిర్వహించిన వర్క్ షాప్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యా బోధనా, సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికా, ముస్తాబు కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో ఖచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారి మానసిక స్థితి గమనించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు బోధించాలని మంత్రి సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పన్నెండేళ్లుగా దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజా విశ్వాసాన్ని నిల బెట్టుకునేలా పుష్కర కాలంగా నరేంద్ర మోదీ అద్భుతమైన పాలన చేస్తున్నారని చెప్పారు. ఈ 12 ఏళ్లల్లో ప్రపంచ దేశాలు మన వైపు చూసేలా అనేక రంగాల్లో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. పన్నెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు రేపు తిరుపతిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్డీయే పాలనా కాలంలో ఎటువంటి అసమానతలు లేకుండా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలను అందించారని మాధవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా `యోగాంధ్ర` కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతరామరాజు, అన్నమయ్య, శ్రీకాకుళం, ఏలూరు జిల్లాల్లో ఈరోజు ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నంలోని నావెల్ డాక్ యార్డ్ లో భారత నౌకాదళం, జిల్లా యంత్రాంగం, ఆయుష్ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా తోటపల్లి జలాశయం గట్టు సమీపంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ వేడుకలలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో అవసరమని, నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా హార్సిలీ హిల్స్ లో కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

విరామం

=====================

రాష్ట్రంలో గత ఏడాది చేపట్టిన డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించి స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. గతంలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఏ రిక్రూట్‌మెంట్‌లోనైనా క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్ తో పాటూ మిగతా అభ్యర్థుల వలె వారు కూడా పరీక్ష రాసి అర్హత సాధించాలన్న నిబంధన ఉండేదని చెప్పారు. కానీ ప్రస్తుత అధికార ప్రభుత్వం ఆ నిబంధనను మార్చి.. స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచడంతో పాటూ.. అసలు పరీక్షే రాయాల్సిన అవసరం లేదంటూ కొత్త జీవో తీసుకువచ్చి అక్రమాలకు పాల్పడిందన్నారు. ఈ విధానంతో నష్టపోయిన డీఎస్సీ అభ్యర్థులకు సంఘీభావంగా తమ పార్టీ రేపు నిరసనలు చేపడుతుందని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రెండేళ్ల వైఫల్యాలపై కూడా నియోజకవర్గ స్థాయిలో నిరసన ర్యాలీలు నిర్వహిస్తుందని చెప్పారు.

=====================

రాష్ట్ర ప్రభుత్వం DSCని ఎంతో పారదర్శకంగా నిర్వహించిందని విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు విలేకర్లతో మాట్లాడుతూ... 2025 DSCపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. 2024 డిఎస్సీలో నోటిఫికేషన్ కొన్ని న్యాయ పరమైన కారణాల వల్ల నిర్వహించలేకపోయామని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ... స్పోర్ట్స్ సర్టిఫికెట్స్ అన్ని నిబంధనలకు అనుగుణంగానే వెరిఫికేషన్ చేశామని తెలిపారు. నకిలీ సర్టిఫికెట్స్ ఇచ్చారన్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

=====================

యువతకు ప్రపంచ స్థాయి విమానయాన శిక్షణ ఇచ్చేందుకు రాజమహేంద్రవరంలో అత్యాధునిక ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ)ను ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. మధురపూడిలో జార్విస్ ఏవియేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పైలట్ ట్రైనింగ్ సెంటర్‌కు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ విమానయాన రంగం అభివృద్ధిలో ఇది ఒక కీలక ముందడుగని, రాష్ట్రంలోనే తొలి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌గా ఈ శిక్షణా కేంద్రం నిలవబోతుందని పేర్కొన్నారు. సుమారు ఆరు నెలల్లో దీనిని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తొలి దశలో సుమారు 30 మంది శిక్షణార్థులకు శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా... గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం వాటి సంఖ్యను 166కు పెంచిందన్నారు. ఉడాన్ పథకం ద్వారా విమాన ప్రయాణాన్ని సామాన్య ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పురంధేశ్వరి వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

ఆరోగ్య శాఖలో జీరో వేకెన్సీ విధానం అమలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ కింద 529 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్ అనుసరించి జాతీయ ఆరోగ్య మిషన్ కింద 6 కేటగిరీల్లో కలిపి 267 మెడికల్ ఆఫీసర్ల భర్తీకి సంబంధించి పోస్టింగ్ ఉత్తర్వులను రేపు పంపనున్నామని తెలిపారు. ముగిసిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు అనుసరించి పోస్టింగ్ ఉత్తర్వులు అభ్యర్థులకు మెయిల్స్ ద్వారా వెళ్తాయని తెలిపారు. వీరు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లోని ఎన్సీడీ క్లినిక్‌లు, నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లుగా విధుల్లో చేరనున్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

=====================

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లపై అధ్యయనం కోసం సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్ ఈరోజు ఏలూరు జిల్లాలో పర్యటించింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని కమిషన్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తో కలిసి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన స్థానిక సంస్థల అధికారులతో ఈరోజు సమావేశమైంది.

=====================

=====================